వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 031
పేజీలు : 09 | వెల: రూ.5/-
గురువారం
జనవరి 08, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## షటిల్ విజేతలకు బహుమతులు



9లో..

వివరాలు 2లో..







# సింప్లిసిటీ @ స్నేహ శబరీష్

చేతిలో మొబైల్, సాదాసీదా వస్త్రాదరణ, అహర్యం చూసి కలెక్టర్ అంటే ఇలా ఉండాలని అనుకుంటారు. హంగు, ఆర్భాటాలకు ఆమె దూరంగా ఉంటారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపైనే ఆమె దృష్టి. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పాలన సాగిస్తారు. ఆమే.. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్. ఆరు మాసాలుగా హనుమకొండ జిల్లా పాలనాధికారిగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆమె ప్రజల ఆదరణ చూరగొన్నారు. జిల్లా అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. సాదా సీదాగా అందరితో కలిసిపోతున్నారు. జిల్లా కలెక్టర్ స్థానంలో ఉన్నప్పటికీ సింప్లిసిటీకే ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాలన వ్యవహారాల్లో మాత్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. జవాబుదారీతనం, దయాగుణం, నిజాయితీ, నైతిక స్థైర్యం ప్రతి ఐఏఎస్ కు తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలు. ఈ విలువలను ఆమె విశ్వసించి ఆచరిస్తున్నారు. రాజ్యాంగ విలువలే ప్రామాణికంగా ప్రజల కోసం కలెక్టర్ స్నేహ శబరీష్ పనిచేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ.. వసతి గృహాల్లో మెనూను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యం వీడి ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

- విధి నిర్వహణలో నిక్కచ్చి
- హంగు, ఆర్భాటాలకు దూరం
- హనుమకొండ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల అమలే ధ్యేయం
- హనుమకొండ కలెక్టర్‌గా ప్రత్యేక స్థానం

## అటకెక్కిన అభివృద్ధి

- ఓరుగల్లుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ద్రోహం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు



9లో..



## మేడారం జాతరకు రండి

### కేసీఆర్ ను ఆహ్వానించిన మహిళా మంత్రులు

ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా వెలుగొందుతున్న మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు రావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆహ్వానించారు. గురువారం ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మంత్రులు సురేఖ, సీతక్కలను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించి బాగున్నరా.. అమ్మ అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు జరుగనున్న మేడారం జాతరకు రావాల్సిందిగా కేసీఆర్ దంపతులను మంత్రులు ప్రభుత్వం తరపున ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కొద్ది సేపు వారితో పిచ్చాపాటి మాట్లాడారు. ఇంటికి వచ్చిన ఆడబిడ్డలకు అతిథి మర్యాదలతో పసుపు కుంకుమ, చీర, తాంబూలం అందజేసి సంప్రదాయ పద్ధతిలో కేసీఆర్ దంపతులు సత్కరించారు. – వరంగల్ వాయిస్, వరంగల్







గడ్డం
కేశవమూర్తి

# సింప్లిసిటీ @ స్నేహ శబరీష్



- విధి నిర్వహణలో నిక్కచ్చి
- హంగు, ఆర్భాటాలకు దూరం
- హనుమకొండ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల అమలే ధ్యేయం
- హనుమకొండ కలెక్టర్‌గా ప్రత్యేక స్థానం

అభివృద్ధి, సంక్షేమంలో హనుమకొండ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె జిల్లాలో చేపట్టిన వివిధ రహదారుల నిర్మాణాలను వేగవంతం చేశారు. కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను పట్టాలెక్కించారు. జేఎన్ఐఎస్ లో స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి ప్రాంతంలో ట్రిపుల్ ఐటీ, ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి వద్ద సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

## మాస్టర్ ప్లాన్ అమలుకు కసరత్తు..

అదేవిధంగా నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి, తాగునీటి పైపులైన్లకు లైన్ క్లియర్ చేయించారు. మహానగర మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చారిత్రాత్మక భద్రకాళి దేవాలయం ఆధునీకరణ, మాడవీధుల నిర్మాణాల్లో వేగం పెంచారు. ప్రాచీన కాలం నాటి హనుమకొండ కలెక్టరేట్ బంగ్లాను ఆధునీకరించారు. భీమదేవరపల్లి మండలం వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నారు. పరకాలలో రూ.35 కోట్లతో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు, 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా జిల్లాలో 435 ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయిస్తున్నారు. వన మహోత్సవంలో ఈ ఏడాది 23 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకొని, జిల్లాలో 957 హెక్టార్లలో అడవులను పునరుద్ధరించారు.

## నాలాల ఆక్రమణపై సీరియస్..

పలు డివిజన్లోని కాలనీల ముంపునకు కారణమైన నాలాల కబ్జాపై దృష్టి కేంద్రీకరించారు. వరద ముంపునకు కారణాలను తెలుసుకొని వాటి నివారణకు సత్వర చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మెంథా తుఫాన్ సమయంలో శక్తి మేరకు ఆమె పనిచేశారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. భూభారతి చట్టం ప్రకారం జిల్లాలో రైతులకు సంబంధించిన భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తున్నారు. జిల్లాలో విత్తనాలు, ఎరువులు తగినంత స్టాక్ అందుబాటులో ఉంచి నకిలీ విత్తన, ఎరువుల కొరతను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకున్నారు.

## ఆర్థిక స్వావలంబనకు కృషి..

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రుణాలు అందజేస్తున్నారు. వివిధ పథకాల కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ స్నేహ శబరీష్ వేగవంతం చేశారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి, కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరలో భక్తులకు పూర్తి సదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ వైద్యశాలలు, వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, అవినీతి సొమ్ము ఎంత సంపాదించినా సంతోషంగా ఉండలేరని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.











## మహిళలే కీలకం..

సమాజ నిర్మాణంలో మహిళల కృషి, వ్యక్తిత్వం కీలకం అంటారు కలెక్టర్ స్నేహ శబరీష్. మహిళలతోనే మంచి సమాజం సాధ్యం అవుతుందంటారామే. మహిళలు మానసికంగా, భావోద్వేగపరంగా బలమైన వారంటారు. వివక్ష ఉన్న కాలంలోనే ఎందరో వీరవనితలు మహిళల్లో చైతన్యం నింపారని గుర్తు చేస్తున్నారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి విజయం సాధించారని చెప్పారు. విద్యతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ప్రతి మహిళకు అక్షర జ్ఞానం అవసరమని, నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆమె వివరించారు. ఒకప్పుడు ఇంటి పనులకే పరిమితమైన మహిళలు నేడు ప్రభుత్వ అధికారులుగా, వ్యాపారులుగా రాణిస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల అమలులో కొందరు మహిళామణులు చేస్తున్న కృషి ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతుందన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, జనవరి 08, 2026

# ప్రపంచ ఛాంపియన్లుగా ఎదగాలి

**◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




**వరంగల్ వాయిస్, గణపురం :** తెలంగాణ గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను చాటి ప్రపంచ ఛాంపియన్లుగా నిలవాలని, అప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం నెరవేరుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. గురువారం గణపురం మండల కేంద్రంలో సీఎం కప్ 2025-26 క్రీడా పోటీల నేపథ్యంలో నిర్వహించిన 'టార్చ్ ర్యాలీ'కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 14 వరకు మొత్తం నాలుగు దశల్లో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం నుంచి సాయిబాబా మందిరం వరకు క్రీడాకారులు, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే సీఎం కప్ ప్రధాన ఉద్దేశం.క్రీడాకారులకు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఖ్యాతిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, ఎంఈఓ అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు. అలాగే సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్. రాజేందర్, మాజీ ఎంపీపీ వి.నారాయణ, నాయకులు ఎం.మల్లికార్జున్, హెచ్.ఎం సతీష్, పీడీ సరిత తదితరులు పాల్గొన్నారు.

# హామీలు ఏమయ్యాయి?

**తెలంగాణ ఉద్యమకారుల ఆగ్రహం**

**కాళోజీ సెంటర్లో నిరసన**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కాళోజీ సెంటర్ల లో ఉద్యమకారులు భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ వైఖరిపై నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుడు చాగంటి రమేష్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని మండిపడ్డారు. "తెలంగాణ కోసం పోరాడి జైలుకు వెళ్లి, కేసులు ఎదుర్కొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ. 20 వేల పింఛన్ ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు." "అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదు" అని ఆయన ఆక్షేపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసలైన ఉద్యమకారులను గుర్తించాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యమకారులు రుద్రోత్ సంపత్, గుగులోత్ విజయ్, మచ్చ రమేష్, మిర్యాల బెనర్జీ, రాయపురం హరీష్, సంపత్, పున్ని చిరంజీవి, రవి, రఘు, హరీష్, శీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు వరం 'మొబైల్ మెడికల్ క్యాంప్'

**170 మందికి ఉచిత వైద్య సేవలు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేద ప్రజలకు, భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా హనుమకొండలోని సాయిబాబా మందిరంలో గురువారం నిర్వహించిన మొబైల్ మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 170 మంది భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సిద్ధార్థ రోగులను పరీక్షించి, తగిన వైద్య సలహాలు సూచించారు. కాలనీ వాసులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఈ శిబిరం ఎంతో ప్రయోజనకరంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. సాయిబాబా మందిరం ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. మందిరానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సామాజిక బాధ్యతగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ మతుకుపల్లి హరగోపాల్, ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్, క్యాంప్ ఆఫీసర్ నవీన్, సిబ్బంది సరిత, లక్ష్మి, జగదీష్, ఆర్కా ప్లే స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ స్రవంతి, మందిర సిబ్బంది సాయి కృష్ణ, రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామాల్లో విద్యుత్ కష్టాలకు చెక్

**◆ ప్రజాబాటలో కాటారం ఏడీఈ రమేష్ బాబు**



**వరంగల్ వాయిస్, మల్హర్ :** గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యంగా 'ప్రజాబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాటారం విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్ బాబు తెలిపారు. గురువారం మల్హర్ మండలంలోని వల్లెంకుంట గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ముంచుకొస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్, ఓవర్ లోడ్ వంటి సమస్యలను గుర్తించి, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామస్థుల నుంచి వచ్చిన విన్నపాలను స్వీకరించి, లైన్ల మరమ్మతులు, అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ కటకం స్వప్న, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ ఇంచార్జి ఏఈ శేఖర్, లైన్ మెన్ శ్రీనివాస్ రెడ్డి, అన్ మాన్డ్ వర్కర్ బొమ్మ బాపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

**కార్పొరేటర్ పల్లం పద్మ**




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా, విద్యుత్ సమస్యల త్వరితగతిన పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 32వ డివిజన్‌లో కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ లోని ఎస్ఆర్ఆర్ తోట, సీతారామాంజనేయ రైస్ మిల్లు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్, అక్కడ నెలకొన్న విద్యుత్ సమస్యలను స్వయంగా పరిశీలించారు. లో-వోల్టేజ్ సమస్యలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇతర సాంకేతిక ఇబ్బందులను అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ దేవరాయి సంపత్ మాట్లాడుతూ.. కార్పొరేటర్ దృష్టికి తెచ్చిన సమస్యలన్నింటినీ పరిశీలించామని, యుద్ధప్రాతిపదికన వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ రవితో పాటు విద్యుత్ శాఖ అధికారులు ఏఈ దేవరాయి సంపత్, ఎస్ఎల్ఐ కృష్ణ బోడ, ఎల్ఐ తిరుమలేశ్ పోషల, ఎల్ఐ దుప్పటి భిక్షపతి, ఎల్ఎంలు సాంబయ్య, శరత్, రాముల నాయక్, వీరితో పాటు మహిళా వర్కర్లు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'ఇందిరమ్మ చీరల' పంపిణీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో గురువారం మహిళా సాధికారతలో భాగంగా 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్థానిక సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సంఘాల బలోపేతానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. చీరలు అందుకున్న మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తోట శ్రీపతి రావు, వార్డు సభ్యురాలు పంతకాని గౌతమి బాపు, సీఏ బోడ సునీత సంపత్, వీఓ మంథని లక్ష్మి ముత్తయ్య, వీరితో పాటు గ్రామంలోని మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడాకారులకు టీ-షర్టుల పంపిణీ



**వరంగల్ వాయిస్, గణపురం:** క్రీడలు శారీరక దృఢత్వాన్ని ఇవ్వడమే కాకుండా మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు దోహదపడతాయని భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ములుగు జిల్లా కొత్తూరులో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే గణపురం క్రికెట్ జట్టుకు ఆయన గురువారం సొంత ఖర్చుతో టీ-షర్టులను అందజేశారు. అనంతరం క్రీడాకారులు లక్ష్మీ నరసింహారావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణపురం బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు హఫీజ్, క్రీడాకారులు నిమ్మ సురేందర్, తాళ్లపెల్లి సాయి వర్ధన్, ఎండీ వాజిత్, ఎండీ ఇమ్రాన్, పూజారి రాకేష్, ఎండీ ముజ్జు, తాళ్లపెల్లి హర్ష, రమేష్, వహీద్, రోహన్, సాజిత్, మంద రాజు, అభి, షఫీ, వెంకటేష్, కృష్ణ, సోన్ను, బన్నీ, సర్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాకు 'జువెనైల్ జస్టిస్ బోర్డు'




**వరంగల్ వాయిస్, ములుగు:** ములుగు జిల్లా పరిధిలోని బాలనేరస్థుల కేసులను త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేకంగా జువెనైల్ జస్టిస్ బోర్డును ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వీపీ సూర్యచంద్రకళ తెలిపారు. గురువారం జిల్లాలోని బాలరక్ష భవన్‌లో ఆమె ఈ బోర్డును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న బాలలు నేరాలకు పాల్పడితే, వారి కేసులను ఇకపై ఈ బోర్డు పరిధిలోనే విచారిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్ గుంటి జ్యోత్స్న ఆధ్వర్యంలో ఈ విచారణలు జరుగుతాయి. ప్రతి బుధవారం కేసుల విచారణ చేపట్టి, బాలల్లో పరివర్తన తీసుకురావడానికి కృషి చేస్తారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని బాలలకు ప్రభుత్వం తరపున ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.కన్యాలాల్, అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ మధులిక తేజ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా సంక్షేమ శాఖ అధికారి తుల రవి, ఉమ్మడి జిల్లా ప్రోబేషన్ అధికారి రమణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వేణుగోపాలాచారి, ప్రధాన కార్యదర్శి రుద్రోజు భిక్షపతి, పీపీలు శంకర్, రాంసింగ్, పిల్లల పరిరక్షణ అధికారి ఓంకార్, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

## ◆ సర్వం కోల్పోయిన కుటుంబం

**వరంగల్ వాయిస్, కాటారం/మల్హర్ :** కాటారం మండలం గంగారం గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం ఒక పేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఎగిసిపడటంతో పూరి ఇల్లు పూర్తిగా కాలి బూడిదయ్యింది. గంగారం గ్రామానికి చెందిన వీణవంక దుర్గయ్య – మమత దంపతులు స్థానిక మోడల్ స్కూల్ ఎదురుగా ఓ పూరి ఇంట్లో నివసిస్తూ హోటల్ నడుపుకుంటున్నారు. దుర్గయ్య ప్రస్తుతం అయ్యప్ప మాలధారణలో ఉన్నారు. గురువారం ఉదయం ఇంట్లో పూజలు ముగించుకున్న కుటుంబ సభ్యులు, మాల విరమణ కోసం గారెపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లారు. వారు ఆలయానికి వెళ్లిన కొద్దిసేపటికే ఇంట్లో మంటలు చెలరేగాయి. పూరి ఇల్లు కావడంతో మంటలు క్షణాల్లో ఇల్లంతా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, హోటల్ కు సంబంధించిన సామాగ్రి, ఒక కుట్టు



మిషన్, నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. పూజ అనంతరం వెలిగించిన దీపం వల్ల ప్రమాదం జరిగిందా? లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. కట్టుబట్టలతో మిగిలి, సర్వం కోల్పోయిన దుర్గయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బింగి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా హనుమకొండలోని కుమార్ పల్లిలో కార్పొరేటర్ బైరి లక్ష్మి, బైరి శ్రవణ్ కుమార్ ను ఆయన పరామర్శించారు.ఈ పర్యటనలో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బింగి శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలియజేశారు. అనంతరం 2019లో తనకు సంభవించిన అగ్నిప్రమాదం గురించి, ఆ ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టం, అప్పటి నుంచి తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎన్. రామచంద్రరావుకి వివరించారు. బాధితుడి ఆవేదనను సావధానంగా విన్న రామచంద్రరావు సానుకూలంగా స్పందించారు. కార్పొరేటర్ బైరి లక్ష్మి, బైరి శ్రవణ్ కుమార్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వెంకటాపూర్ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ అధికారులను, వంట ఏజెన్సీలను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో భోజన నాణ్యత పరిశీలన ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. ప్రతిరోజూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందుతుందా? కూరగాయలు, అన్నం నాణ్యత ఎలా ఉంది? అని విద్యార్థుల ద్వారా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడుతూ.. వంటలో నాణ్యత పాటించాలని, శుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు: ఉప సర్పంచ్ రాజు, వార్డు మెంబర్లు బానోతు సునీల్ గవాస్కర్, నల్ల కోటి, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చీకుర్తి రమేష్, కాంగ్రెస్ నాయకులు జాకీర్, అన్నేవెన శ్రావణ్, మిలుకురి యుగేందర్, బుస్సా గణేశ్, బానోతు రాజేందర్ పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవే విశ్వమానవ సేవ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కల్మషం ఎరుగని మానసిక దివ్యాంగ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే నిజమైన పండుగ అని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. హనుమకొండలోని వికాస్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల చిన్నారులకు డాక్టర్ అనితా రెడ్డి, ఇతర అతిథులు భోగి పండ్లు పోశారు. ఈ సందర్భంగా చిన్నారులు చూపిన ఉత్సాహం, ఆనందం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేస్తున్న వికాస్ పాఠశాల నిర్వాహకులను, సిబ్బందిని అభినందించారు. వారికి భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ సంస్థ తరపున సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో పాఠశాల నిర్వాహకురాలు విశాలి, డీసీపీయూ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ఓ రవి కృష్ణ, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ తేజస్విని, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అలియాబాద్‌లో 'ప్రజాబాట'




**వరంగల్ వాయిస్, పరకాల:** క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను గుర్తించి, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ చేపట్టిన 'ప్రజాబాట' కార్యక్రమం శుక్రవారం పరకాల మండలంలోని అలియాబాద్ గ్రామంలో ఉత్సాహంగా జరిగింది. గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సనత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపు, ప్రమాదాల నివారణ మరియు వినియోగదారుల బాధ్యతలపై ప్రజలకు వివరించారు. అనంతరం సర్పంచ్ సనత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు విద్యుత్ బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా ప్రతి నెలా సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్‌ను వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా లూజ్ వైర్లు, వంగిన స్తంభాలు లేదా ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విశ్రాంత పోలీసుల సేవలు చిరస్మరణీయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన విశ్రాంత పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర–2026 డైరీని గురువారం ఆయన, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో మరణించిన పోలీసు అధికారుల స్మృత్యర్థం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సంఘం సభ్యులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ సంఘం సంక్షేమ కార్యకలాపాల కోసం తను వ్యక్తిగతంగా రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. సంఘానికి ప్రత్యేక భవన స్థలం కేటాయింపు కోసం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణ తర్వాత



కూడా సంఘం ద్వారా ఐక్యంగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవ రెడ్డి, సంఘం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ‘సీఎం కప్’ సువర్ణావకాశం

- ములుగు కలెక్టర్ దివాకర టీఎస్
- ఘనంగా ‘టార్చ్ ర్యాలీ’ ప్రారంభం



**వరంగల్ వాయిస్, ములుగు :** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘సీఎం కప్’ రెండో ఎడిషన్ ఒక గొప్ప వేదికని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మూడు రోజుల పాటు టార్చ్ ర్యాలీజిల్లాలోని యువతకు, విద్యార్థులకు ఈ పోటీలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు వివిధ కేంద్రాల్లో టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 8న కలెక్టరేట్ ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట, జనవరి 9న ఐటీడీఏ కార్యాలయం, మంగపేట, తాడ్వాయి, జనవరి 10న ముప్పనపల్లి, వాజేడు, వెంకటాపురం ఉన్నాయి. శాట్స్ ఆధ్వర్యంలో మొత్తం 44 రకాల క్రీడల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నారు. జనవరి 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయి, జనవరి 28 నుంచి 31 వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజక వర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరగనుననాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మలోత్ సర్దార్ సింగ్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పీడీలు , పీఈటీలు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని కల్లెడ గ్రామంలో అదృశ్యమైన ఒక వ్యక్తి గురువారం ఉదయం శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. మృతుడిని అదే గ్రామానికి చెందిన ఆకారపు రాములు (50) గా పోలీసులు గుర్తించారు. కల్లెడ గ్రామానికి చెందిన రాములు కుమ్మరి వృత్తితో పాటు, వ్యవసాయం మరియు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న ఎప్పటిలాగే కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. తిరిగి అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో “బయటకు వెళ్లి వస్తాను” అని చెప్పి వెళ్లిన రాములు, ఎంతసేపటికీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో, మృతుడి భార్య ఆకారపు కళావతి పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం గ్రామ శివార్లలో రాములు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ‘అక్షర’ ఎంపిక

## విజ్ఞాన భారతి విద్యార్థుల పతకాల పంట



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** క్రీడా రంగంలో పర్వతగిరి మండల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని చింతనెక్కొండ విజ్ఞాన భారతి విద్యాలయం విద్యార్థులు పతకాల పంట పండించారు. బుధవారం హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థిని బాలబోయిన అక్షర అద్భుత ప్రదర్శనతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. అండర్–8 గర్ల్స్ విభాగంలో పాల్గొన్న అక్షర తన వేగంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచింది. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ (ప్రథమ స్థానం), స్టాండింగ్ బ్రాడ్ జంప్ విభాగంలో గోల్డ్ మెడల్ (ప్రథమ స్థానం), మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్న అక్షర, త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. అక్షరతో పాటు అదే పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో రాణించారు. దబ్బెట శశిధర్ (అండర్–8 బాయ్స్) 60 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో సిల్వర్ మెడల్స్ (ద్వితీయ స్థానం), ధరావత్ సహస్ర (అండర్–10 గర్ల్స్) లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ (ద్వితీయ స్థానం), తోకల రిత్విక్ (అండర్–14 బాయ్స్) ట్రైట్లీల్లో బ్రోంజ్ మెడల్ (తృతీయ స్థానం) సాధించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను విజ్ఞాన భారతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, చింతనెక్కొండ గ్రామస్తులు ఘనంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అక్షర విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

# చాగంటి రాములు మృతి సీపీఎంకు తీరని లోటు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని కుర్చపల్లి గ్రామ సీపీఎం సీనియర్ సభ్యులు, నిఖార్సైన కమ్యూనిస్ట్ నాయకుడు కామ్రేడ్ చాగంటి రాములు మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నారు. అనారోగ్యంతో మరణించిన రాములు భౌతికకాయాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ.. చాగంటి రాములు తన చివరి శ్వాస వరకు పార్టీ నీతి, నిజాయితీలకు కట్టుబడి పనిచేశారని కొనియాడారు. రాములు కుటుంబ సభ్యులను పరామర్శించిన పార్టీ నేతలు, వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాములు ఆశయ సాధన కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, గ్రామ కార్యదర్శి కాసాని పుల్లయ్య, మండల కమిటీ సభ్యులు మంచాల మల్లేష్, గ్రామ నాయకులు కాసాని వెంకటయ్య, తోటకూరి భూపాల్, మంచాల తిరుమాల్, పార్టీ శ్రేణులు తోటకూరి యాకయ్య, చింతల కొమురయ్య, రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** గీసుకొండ మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ పెరిక కుల నాయకులు బరుపటి సదానందం, బరుపటి రవిల మాతృమూర్తి బరుపటి సుశీలమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ మొగిలిచర్ల గ్రామానికి చేరుకుని, ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి కుల సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో బొట్టు కమలాకర్, బుద్దె వెంకన్న, మంద గోపాల్, అచ్చ మధూకర్, ముచ్చర్ల సంపత్, లక్కర్సు పూర్ణచందర్, పత్తిపాక తిరుపతి, అచ్చ రమేశ్, ముక్కెర సూరయ్య, అంకతి సాంబయ్య, బిల్ల శ్రీకాంత్, సుంచు వీరన్న, సంకతాల రవి, పూర్ణ చందర్, అచ్చ శ్రీకాంత్, బుద్దె ప్రశాంత్, మేడిశెట్టి వరుణ్, బిల్ల భగత్, కందిమల్ల భూషణ్, కుల సంఘం సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

# రాజ్యాధికారమే లక్ష్యంగా ఐక్యం కావాలి

- నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, గణపురం :** బహుజన వర్గాలు అన్ని రంగాల్లో పైచేయి సాధించాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముందడుగు వేయాలని భూపాలపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం గణపురం మండల బీసీ జేఏసీ చైర్మన్ బత్తిని శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల సర్పంచ్‌లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైడిపల్లి రమేష్ మాట్లాడుతూ, ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన సర్పంచ్‌లు వారి ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేయాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో బహుజన ప్రాతినిధ్యం పెరిగేలా సంఘాల నాయకులు ఐక్యంగా పనిచేయాలి. ఈ వేడుకలో సర్పంచ్‌లు కావటి రజిత రవీందర్ (చెల్పూర్), విడిదినేని శ్రీలత అశోక్ (బుద్ధారం), ఇంజపెల్లి శ్రీనివాస్ (గాంధీనగర్), చింతకుంట్ల సునీత శ్రీనివాస్ (బస్వరాజు పల్లి), పూజారి రాజేందర్ గౌడ్ (ధర్మారావుపేట), ఉడుత సాంబయ్య యాదవ్ (పరశురాంపల్లి), భూక్య సమ్మయ్య (మైలారం), తుమ్మల సంపత్ (బుర్ర కాయలగూడెం), ఓరుగంటి కృష్ణ గౌడ్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–కన్వీనర్ పోతర్ల మల్లికార్జున్ యాదవ్, కొత్త వెంకన్న, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, వైనాల వెంకటేశ్వర్లు, బీసీ జేఏసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడా పోటీలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మల్హార్ :** మండల కేంద్రంమైన తాడిచర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో క్రాంతి కుమార్ అధ్యక్షతన సీఎం కప్ క్రీడా పోటీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కప్ క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, సీఎం క్రీడా పోటీలు గ్రామస్థాయిలో ఈనెల 17 నుంచి 22 వరకు, మండల స్థాయిలో ఈనెల 28 నుంచి 31 వరకు, నియోజవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 19 నుంచి 26వ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలలో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా గ్రామస్థాయి వరకు ప్రజలకు సమాచారం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్ కుమార్, ఎంపీవో విక్రమ్ మండలములోని అన్ని పాఠశాలల పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తల్లి సర్పంచ్.. కొడుకు పెత్తనం!

## కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని అడ్వాలపల్లి గ్రామ పంచాయతీలో 'తల్లి సర్పంచ్.. కొడుకు పెత్తనం' సాగుతోందని గ్రామ మాజీ సర్పంచ్ రాజు నాయక్, కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా రాజు నాయక్ మండిపడ్డారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రస్తుత సర్పంచ్ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సర్పంచ్ అజ్మీరా సారక్క ఇటీవల బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఆమె పేరుతో కొడుకు అజ్మీరా బాలాజీ నాయక్ అన్నీ తానై వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి ప్రాధాన్యత ఇస్తుంటే, సర్పంచ్ సారక్క అధికారిక కార్యక్రమాలకు హాజరుకాకుండా తన కొడుకును పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన వ్యవసాయ పనిముట్లను, ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి బాలాజీ నాయక్ పంపిణీ చేయడమే ఇందుకు నిదర్శనమని వారు సాక్ష్యాలను బయటపెట్టారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని బేఖాతరు చేస్తూ, అనధికార వ్యక్తులు పాలనలో జోక్యం చేసుకోవడంపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు. సర్పంచ్ కొడుకు పెత్తనాన్ని అరికట్టి, చట్టబద్ధమైన పాలన సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# మృతురాలి కుటుంబానికి సర్పంచ్ పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల యాకలక్ష్మి అనారోగ్యంతో మరణించగా పార్థదేహానికి పర్వతగిరి గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుమారుడు కుమారస్వామి ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి పట్టణ అధ్యక్షులు కుసం రామచందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, పర్వతగిరి ఉపసర్పంచ్ చింతకుంట్ల అనిత రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోకల శంకర్, బోట్ల కనకరాజు, మంద జగన్, బొట్ల వెంకన్న, సముద్రాల శివ, మునిగే కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ కిట్ అందజేత



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన దివంగత లింగాల సుభాష్ రెడ్డి జ్ఞాపకార్థం, వారి కుమారుడు లింగాల అభిలాష్ రెడ్డి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గ్రామ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయాలనే సత్సంకల్పంతో, సుమారు రూ.12,000 విలువగల క్రికెట్ కిట్‌ను యువతకు అందజేశారు. యువత శారీరక దారుఢ్యంతో పాటు క్రీడల్లో రాణించాలని కోరుకునే సుభాష్ రెడ్డి ఆశయాలకు నిదర్శనంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామంలోని క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందించి, వారిని ప్రోత్సహించడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన యువతకు క్రికెట్ కిట్ అందించడంపై స్థానిక క్రీడాకారులు అభిలాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి ప్రోత్సాహం తమను క్రీడల్లో మరింత ముందుకు తీసుకెళ్తుందని వారు పేర్కొన్నారు.

# కేయూ భూముల జోలికొస్తే ఊరుకోం

## ◆ ఎమ్మెల్యే నాయినిపై బీఆర్ఎస్వీ ఆగ్రహం




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ భూముల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు విషయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్వీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం కేయూ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రాష్ట్ర నాయకులు కత్తెరపల్లి దామోదర్, డా. కొమురయ్య, బిఆర్ఎస్వీ ఇంచార్జి జెట్టి రాజేందర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. యూనివర్సిటీ భూమిని కాపాడాలని పోరాడుతున్న బిఆర్ఎస్వీపై ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా అవాస్తవాలు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనం. హనుమకొండ చుట్టుపక్కల ప్రభుత్వ భూములు లేవని చెప్పడం శుద్ధ అబద్ధం. యూనివర్సిటీ ఎదురుగా ఉన్న టీబీ ఆసుపత్రి స్థలంతో పాటు అనేక ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని వారు గుర్తు చేశారు. విద్యాసంస్థల పేరుతో యూనివర్సిటీ భూములను లక్ష్యంగా చేసుకోవడం వెనుక పెద్ద ఎత్తున భూ కబ్జా కుట్ర దాగి ఉందని వారు ఆరోపించారు. గతంలో వర్సిటీ భూములపై తాము చేసిన పోరాటం వల్ల ప్రభుత్వం సర్వే నిర్వహించిందని, ఆ సర్వే రిపోర్టును ఇప్పటి వరకు ఎందుకు బహిర్గతం చేయడం లేదని నాయకులు ప్రశ్నించారు. రిపోర్టు బయటకు వస్తే ఎవరెవరు భూములు ఆక్రమించారో తెలుస్తుందనే భయంతోనే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కోర్డినేటర్లు రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజు, ముస్కె రాము, గొల్లపల్లి వీరు, పస్తం అనిల్, కోరాపెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'బీసీ సబ్ ప్లాన్' అమలు చేయాలి

## పల్లెబోయిన అశోక్ ముదిరాజ్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రాష్ట్రంలో మెజారిటీ జనాభా కలిగిన వెనుకబడిన తరగతులకు (బీసీలకు) న్యాయం జరగాలంటే ఎస్సీ, ఎస్టీల తరహాలోనే తక్షణమే చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో తహసీల్దార్ కు పార్టీ తరపున వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించకపోవడం తీవ్రమైన అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం సబ్ ప్లాన్ ఒక్కటే సరైన పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బీసీ సబ్ ప్లాన్ ప్రకటించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇది కేవలం వినతిపత్రంతో ముగిసే పోరాటం కాదని, హక్కులు సాధించే వరకూ రాజ్యాధికార పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బగ్గి రాజు, రాష్ట్ర నాయకులు పోలు రాజు, సోషల్ మీడియా ప్రతినిధులు సౌత్ తెలంగాణ కన్వీనర్ మార్త శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రమణ,ఇతర నాయకులు కొమురయ్య, సాయికుమార్, జయ్ నాయక్, అబ్దులరహీం, జగదేశ్వర్, తరుణ్, లక్ష్మణ్, మహిళా నాయకులు బాలినే లక్ష్మి, మంచాల పద్మ, గడ్డం మాధవి, భువనగిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# భీంపల్లిలో కోతుల బీభత్సం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో కోతుల బెడద హద్దులు దాటుతోంది. శుక్రవారం గ్రామానికి చెందిన తోట లక్ష్మి నివాసంలో కోతుల మూక చొరబడి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో సామాగ్రి ధ్వంసం కావడమే కాకుండా, బాధితురాలు కష్టపడి సంపాదించుకున్న నగదు కూడా మాయమవ్వడం విషాదాన్ని నింపింది. బాధితురాలు తోట లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కోతులు అకస్మాత్తుగా ఆమె ఇంట్లోకి చొరబడ్డాయి. అడ్డుకోబోయిన లక్ష్మిపై దాడికి ప్రయత్నించడంతో కుటుంబ సభ్యులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో కోతులు ఇంట్లోని సామాన్లను చిందరవందర చేసి ధ్వంసం చేశాయి. లక్ష్మి కూలీ పనులు చేస్తూ అతికష్టం మీద 5,000 రూపాయల నగదును భవిష్యత్తు అవసరాల కోసం ఒక పప్పు డబ్బాలో దాచిపెట్టుకుంది. కోతుల గందరగోళంలో ఆ డబ్బాలోని నగదు కనిపించకుండా పోయిందని, కోతులు వాటిని ఎత్తుకెళ్లాయో లేదా ఎక్కడైనా పారేశాయో తెలియక బాధితురాలు కన్నీరుమున్నీరవుతోంది. ఈ ఘటనపై తోట లక్ష్మి తన కుమారుడు రాంప్రసాద్‌తో కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కోతుల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, ఏ క్షణాన ఏమవుతుందోనని ప్రజలు భయం భయంగా గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి, కోతులను బంధించి అడవిలో విడిచిపెట్టాలని, తమకు ఈ బెడద నుండి విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 11న పద్మశాలి ప్రజాప్రతినిధులకు సన్మానోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పద్మశాలి కుల బాంధవులను రాజకీయంగా చైతన్యం చేయడంలో భాగంగా, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన పద్మశాలి ప్రజాప్రతినిధులకు భారీ స్థాయిలో అభినందన సన్మానోత్సవం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ చందా మల్లయ్య తెలిపారు. హంటర్ రోడ్డులోని నంది హిల్స్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. జనవరి 11న ఉదయం 10:30 గంటలకు దామెర మండల కేంద్రంలోని రెడిన్ రిసార్ట్ (ఏఎన్ఆర్ గార్డెన్స్ వెనుక) పద్మశాలి కులానికి చెందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు, రాష్ట్ర సలహాదారులు బాసాని చంద్రప్రకాష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు జిల్లా ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారు. దామెర మండల కమిటీ అధ్యక్షుడు ముదిగొండ కృష్ణమూర్తి నేతృత్వంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లు జరుగుతున్నాయని చందా మల్లయ్య పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని పద్మశాలి ప్రముఖులు, నూతన ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇతర వివరాల కోసం 73960 24 613 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, దామర మండల అధ్యక్షులు ముదిగొండ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి అనిల్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గడ్డం రమేష్, జిల్లా సెక్రెటరీ దుబాసి రమేష్, మండల కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.




# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్ `త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ. 1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ `త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.



## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు




రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తిండిపోతుందంటూ నవ్వులు పూయిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.

## భర్త మహాశయులకు విజ్ఞప్తితో వస్తున్న రవితేజ



'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డిరపుల్ హయాతీ కథానాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు. ఇటీవల వరుస పరాజయాలతో ఉన్న రవితేజ ఇప్పుడు ఈసినామపై ఆశలు పెట్టుకున్నారు. ఇది విజయవంతం కావాలని కోరుకుంటున్నాడు.

## మన శంకర్ వరప్రసాద్ గారు నుంచి హుక్‌స్టెప్ సాంగ్

చిరంజీవి కథానాయకుడి అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో 'హుక్ స్టెప్' సాంగ్‌ను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను టెలికాస్ట్ చేయగా, అభిమానులే కాదు, వెంకటేశ్, అనిల్ రావిపూడి కూడా ఈ పాటకు డ్యాన్స్ వేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈపాటను బాబా సెహగల్ ఆలపించారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల్లో ఇదే హైలైట్ కావడం గమనార్హం. అంతేకాదు, సోషల్‌మీడియాను కూడా ఓ ఊపు ఊపేయడం ఖాయం.









## రేపు థియేటర్లలోకి ది రాజాసాబ్ మూవీ

### ప్రభాస్ అభిమానులకు సంక్రాంతి పండగ

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడిరది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ `మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిరదని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.



### ఏపీలో పెరిగిన టిక్కెట్ ధరలు

**తెలంగాణలో తొలగని ఉత్కంఠ**

ఈ సినిమా టికెట్ ధరల పెంపు మరియు బెనిఫిట్ షోలకు సంబంధించి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా బెనిఫిట్ షోలకు, తర్వాత పది రోజుల పాటు టికెట్ రేట్లను పెంచుతూ ఒక జీవో జారీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ జీవో ఇంకా రాలేదు. రాత్రికే బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ వేయాల్సి ఉండగా ఆ జీవో ఇంకా రాలేదు. అయితే కోర్టు సమయం ముగిశాక ఆ జీవో జారీ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, నేడు సాయంత్రం 5:30 నుండి 6:00 గంటల మధ్య 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తిస్థాయిలో ఓపెన్ అయ్యే అవకాశం ఉంది.



# సామాన్యుడి గొంతుక 'వరంగల్ వాయిస్'



◆ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ/పరకాల/ శాయంపేట :** ప్రజల పక్షాన నిలబడి సమస్యలను వెలికితీయడంలో 'వరంగల్ వాయిస్' తెలుగు దినపత్రిక తనదైన ముద్ర వేస్తోందని పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూపొందించిన 'వరంగల్ వాయిస్' నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్, గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, సిరంగి సునీల్, శ్రీనివాస్, అధికారులు హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, శాయంపేట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పరకాల తహసీల్దార్ తోట విజయలక్ష్మీ, శాయంపేట మండల ప్రత్యేక అధికారి జట్టి జయంతి, శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ ప్రజాప్రతినిధులు కమలాపూర్ మండలం వెంకటేశ్వర్లు పల్లి సర్పంచ్ మహేందర్ రెడ్డి, నడికూడ మండలం ముస్త్యాలపల్లి సర్పంచ్ వెంకటేష్, పరకాల మండలం అలియాబాద్ సర్పంచ్ సన్నత్ కుమార్, నడికూడ మండలం నార్లాపూర్ సర్పంచ్ రవీందర్ యాదవ్, హనుమకొండలోని వినాయక పీఎం ఫార్మసీ యజమాని పోరెడ్డి ప్రదీప్ రెడ్డి వరంగల్ వాయిస్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'వరంగల్ వాయిస్' పత్రిక సామాన్యుడి గొంతుకగా నిలుస్తోందని కొనియాడారు. రాజీలేని వార్తా కథనాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని, 2026 సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా క్షేత్రంలో పత్రిక మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వాయిస్ ఎడిషన్ ఇంచార్జి గోలి రవి, స్టాఫ్ రిపోర్టర్ సిద్ధోజు రాకేష్, పరకాల రిపోర్టర్ చొక్కారావు, దామెర రిపోర్టర్ శ్రీకాంత్, హనుమకొండ రిపోర్టర్ పూజారి విజయ్, పూజారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.































WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, జనవరి 08, 2026

# మూసుకొని రాసుకోండి

- చేతిలో పెన్ను, పేపర్ ఉంటే విలేఖరా..
- జర్నలిస్టులపై ఎమ్మెల్యే రేవూరి చిందులు
- ఆగ్రహించిన పాత్రికేయులు
- బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో





**వరంగల్ వాయిస్, పరకాల :** మీరేమైనా అడ్వకేట్లా.. వకాలత్ మీరే తీసుకుంటారా..? చేతిలో పెన్నూ, పేపర్ ఉండగానే విలేఖరా? మూసుకొని మేము చెప్పింది రాసుకోవాలి.. ఎదురు మాట్లాడకూడదు అంటూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చిందులు వేశారు. జర్నలిస్టులు ఐతే ఏంటిఅని నిలదీశారు. ఎవరికి వకల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. ప్రజల కోసమే పనిచేస్తున్నామంటూ జర్నలిస్టులు చెప్పుకునే ప్రయత్నం చేయగా ఎమ్మెల్యే రెట్టించిన కోపంతో ఊగిపోయారు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. పరకాల బస్టాండ్ వద్ద ఆక్రమణల తొలగింపును పరిశీలించేందుకు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అధికారులతో కలిసి బస్టాండుకు వచ్చిన క్రమంలో స్థానిక జర్నలిస్టులు ట్రాఫిక్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేయగా దురుసు మాటలతో చిందులు వేశారు.

### జర్నలిస్టుల రాస్తారోకో..

జర్నలిస్టులపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నోరు పారేసుకోవడాన్ని పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. న్యూస్ కవరేజి చేయకుండానే బయటకు వచ్చారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు అప్రజాస్వామికం అంటూ రాస్తారోకో చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖలను ఖండిస్తూ అమరదామంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు చొళ్ళేటి సునేందర్, నేరళ్ళ పరుశురాం, బలేరావు బాబ్జీ, రావుల రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు పాత్రికేయులను కించపరిచేలా ఉన్నాయంటూ ఆరోపించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై ఎమ్మెల్యే నోరు పారేసుకోవడం గర్హనీయం అన్నారు. ఎవరికి వకాల్తా పుచ్చుకున్నారని జర్నలిస్టులపై నోరు పారేసుకున్న ఎమ్మెల్యే ప్రస్తుతం ఎవరి వకాల్తా పుచ్చుకుని బస్టాండ్ ఆక్రమణల ఇనుప కంచ తొలగించారని జర్నలిస్టులు ప్రశ్నించారు. స్వార్ధ రాజకీయాల కోసం పరకాల ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్నాడంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి జర్నలిస్టులపై చిందులు తొక్కుతూ ప్రజాస్వామిక విలువలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ సమావేశంలో కోగిల చంద్రమౌళి, శ్రీరామోజు వేణు, గూడెల్లి నాగేంద్ర, గూడెల్లి కార్తీక్, ఐలి విజయ్, బోజ శ్రీనివాస్ రెడ్డి, చిర్ర సతీష్, సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# మేడారం జాతరను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి
- విధి నిర్వహణపై జోనల్, సెక్టార్స్ అధికారులకు శిక్షణ

**వరంగల్ వాయిస్, ములుగు :** శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను జోనల్, సెక్టార్స్ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి కోరారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరను పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యల్లో భాగంగా మేడారం జాతరలో విధులు నిర్వహించనున్న జోనల్, సెక్టార్స్ అధికారులకు గురువారం మేడారం హరిత హోటల్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలసి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతర ప్రాంతాన్ని సమగ్రంగా 12 జోన్లుగా విభజించి, వాటికి సంబంధించిన 62 మంది జోనల్ అధికారులకు, అలాగే 51 సెక్టార్లకు చెందిన 179 మంది సెక్టార్ అధికారులకు నియమించడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు తీసుకొస్తా..

- రెండు పంటలకు సాగు నీరు అందిస్తా..
- కలిసి పని చేస్తేనే ఇది సాధ్యం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** కడియం శ్రీహరి ద్వారానే దేవాదుల ప్రాజెక్టు వచ్చింది.. ఆయన ద్వారానే ప్రతీ ఎకరానికి గోదావరి నీళ్లు వచ్చాయని ప్రజలు గుర్తుంచుకోవాలన్న సంకల్పంతోనే దేవాదుల ప్రాజెక్టు ఫెజ్–3 ప్యాకేజీ–6 పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్ గడ్ మండలం సాగరం గ్రామ సమీపంలో చేపట్టిన దేవాదుల ప్రాజెక్ట్ ఫెజ్–3, ప్యాకేజి–6 పనులను నీటి పారుదల, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. 2003–04 లో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. దంసా చెరువు, జఫర్ గడ్ చెరువులను మరమ్మత్తు చేసి నష్కల్ నుంచి పాలకుర్తి ప్రధాన కాలువ ఓటి ఏర్పాటు చేసి దంసా చెరువు, జఫర్ గడ్ చెరువులను నింపి 365 రోజులు నీళ్లు ఉండే విధంగా చేయాలని వివరించారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి త్వరలోనే జఫర్ గడ్ మండల కేంద్రంలో రెవెన్యూ, నీటిపారుదల అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నాని, లక్ష్యం నెరవేరాలంటే మనందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ సీఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, ఈఈ మంగీలాల్, డీఈలు, ఏఈలు, తహసీల్దార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# అటకెక్కిన అభివృద్ధి

- ఓరుగల్లుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ద్రోహం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** చారిత్రక ప్రాముఖ్యం కలిగిన ఓరుగల్లుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీరని ద్రోహం చేశాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాం చందర్ రావు దుయ్యబట్టారు. వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఇక్కడికి చేరుకున్న రాం చందర్ రావుకు వరంగల్ చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కాషాయ జెండాలు గర్వంగా ఎగురుతూ సాగిన భారీ బైక్ ర్యాలీలో అండర్ బ్రిడ్జి ప్రాంతంలో శివనగర్ మండలం నాయకులు క్రేన్ సహాయంతో గజమాలతో రాష్ట్ర నేతను సత్కరించారు. అనంతరం రాజశ్రీ గార్డెన్లో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో కార్యకర్తల ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాం చందర్ రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిని శాలువతో సత్కరించి త్రిశూలాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.గౌతమ్ రావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్, వరంగల్ జిల్లా ఇన్చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మార్తనేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, ఆరూరి రమేష్, మాజీ ఎమ్మెల్సీ టి రాజేశ్వరరావు, జయపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రత్నం సతీష్, మాజీ జిల్లా అధ్యక్షులు ఎట్లా అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్ మల్లాడి తిరుపతిరెడ్డి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 200 బైకులతో ర్యాలీ..

బీజేపీ నాయకుడు ఓని వెంకటేష్ నేతృత్వంలో ఓ సిటీ లోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఇంటి నుంచి సుమారు 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ప్రదీప్ రావు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వందమంది రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కర్ని రవీందర్, కందిమల్ల మహేష్, బోరింగ్ నాగరాజ్, కోమాకుల నాగరాజ్, అజ్జు, ఆదిత్య, చిన్న, మరి, తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ..

గ్రేటర్ పరిధిలోని 8వ డివిజన్ కార్పొరేటర్ బైరీ లక్ష్మి కుమారి భర్త మాజి కౌన్సిలర్ బైరీ సాంబయ్య ఇటీవల మరణించగా హనుమకొండ కుమార్ పల్లి లోని పాలజండా ప్రాంతంలో వారి స్వగృహానికి విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఫొటోకు పూలదండ వేసి నివాళులర్పించారు.



# షటిల్ విజేతలకు బహుమతులు

వరంగల్ మహా నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో గురువారం షటిల్ క్రీడోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సాహభరితంగా జరిగిన ఇంటర్నల్ షటిల్ పోటీల్లో సిద్ధార్థ, రాజ్ కుమార్ ప్రథమ బహుమతిని గెలుచుకోగా, నిశాంత్, రాకేష్ ద్వితీయ బహుమతిని అందుకున్నారు. షటిల్ క్రీడోత్సవాల్లో విజేతలకు వరంగల్ వాయిస్ ఎడిటర్, ప్రముఖ అంతర్జాతీయ షిటిల్ క్రీడాకారుడు గడ్డం కేశవమూర్తి, కోమాకుల మధుకర్, పీచు రాజిరెడ్డి, వైవి రాజేందర్, పూజారి విజయ్ కుమార్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిశాంత్, విహాదర్, శివ, గిరీష్, జగదీశ్వర్, రక్షిత్, నవనీత్ సింగ్, కిరణ్, కిషోర్, చాడ రవీందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com